# నువ్వూ నేనూ పడమటి ఆకాశం

(తెలుగుకథ.కామ్ సౌజన్యంతో...)

అర్థాంతరంగా ప్రారంభిస్తాను ... ఒక అబ్సర్డ్ జీవితకోణాన్ని ఆవిష్కరిస్తాను. వాస్తవంగా ఎంగిలి చేస్తున్నవాడెవడో? ఎవడెవడో మన జీవితాల్ని, టోకున ...

కాంటీన్ కిటికీలోంచి గ్లూమీగా ఆకాశం ... బూడిదరంగు మేఘాల వెనుక అండర్ వరల్డ్ డెన్‌లా ... నీడలా ... క్రీనీడలా ... తోడుగా ... చిన్నప్పట్నుంచీ నా తోడుగా...

మరుగుజ్జు బాల్యం మట్టి పింగాణీ కప్పుల్ని మర్దిస్తూందా మూల... ఇంజెక్ట్ చేయుబడ్డ కామానికి ఇంటర్నల్ రియాక్షన్ తోడయితే వెరసి ఎక్స్‌టర్నల్ ఎగ్జిస్టెన్స్ చైల్డ్‌హుడ్ ఈజీ ప్రిజన్ సెంటెక్స్ ఆఫ్ ట్వొంటీ వొన్ ఇయర్స్...

మనం నిజ్జంగా... అచ్చంగా బాల్యంలోనే పుడతాం. పుట్టీ... బతికీ.... బతికీ యువ్వనంలో ఆత్మహత్య చేసుకుంటాం, స్వచ్ఛందంగా.

"ఇరెండు ఛాయా!" నాయర్ అరుస్తున్నాడు... తెల్లగా, బొద్దుగా, విభూది రేఖలతో.

కేరళ... జాకెట్ కేరళ... పైటల్లేని మలబారపు భారాల కేరళ... అప్పటి కేరళ.... నా చిన్నప్పటి కేరళ.... కొబ్బరాకుల కేరళ.... ఉప్పుడు బియ్యం కేరళ.... కథకళి కేరళ...

పొగచూరిన ముతకరంగు గోడల మీద సర్రియలిస్ట్ పెయింటింగ్‌లాంటి లోనటిక్ బూజు తెరలకు గాలి వేస్తూ ... ఫ్యాన్లు... ఫ్యాటిక్‌గా ... టేబుళ్లమీద తుడుపుగుడ్డ వదిలేసిన ముక్కిడు వాసన సాంబార్ మసాలా ఘాటులోంచి... వర్జీనియా పరిమళపు పొగలో తేలాడుతూ... ఆడుతూ.... ఆత్మల్లేని శరీరాల్లా... మనందర్లా... ఖాళీ టీ కప్పులు, గ్లాసులు... వెనుక టేబుల్లో పేదరికం నలిపి నలిపిన అసమర్థపు నాపరాయి వృద్ధాప్యపు చివరాకరి దగ్గులు....

ముందు టేబుల్లో పదహారేళ్ల యువ్వనం ఇరవై ఆరేళ్ల జవ్వనంతో కలసి నవ్వుతోంది పడీ పడీ... మధ్యలో నేను.

ఈ ఆదివారం అనకొండను మధ్యాహ్నందాకా మింగనిస్తాను నన్ను... ఆ తర్వాత చంపేస్తాను ఎలాగోలాగా...

ఆ మూల పొట్ట పోలీసోడెవరో వుక్క ఖాకీ యూనిఫారంలోంచి కాఫీ పీలుస్తున్నాడు కసికసిగా.

నా ఒంట్లో 'వోల్డ్ కస్క్' రమ్ముని నరాల స్ట్రాలతో నా మెదడు పీలుస్తోంది నింపాదిగా.

"రావయ్యా, ముద్దుల మామా! నీకు రాసిస్తా రాయలసీమా..." మూలుగుతోంది గోడ స్పీకరు.

"గుర్తుంచుకో సోదరా, మనం కమ్మలం.... కాపులం, రెడ్లమూ భవిష్యత్ మైనారిటీలం మనమే! వొచ్చే కాలమంతా మనదే...! మన్లో వొకడైనా అంబేద్కర్ పుట్టకపోడు!" నాడీ జాతకం చెబుతున్నా డా మూల రెడ్డి ఎవరికో. వాడు విప్లవానికే అబార్షన్ చేయగల సమర్థుడు. వాడు విప్లవ మంత్రసానుల్ని ఉరితీసే తలారి... వురి.... వురి.... వురి... ఖాద్రి.... జస్టిస్ ఖాద్రి.... రోజీవ్‌గాంధీ నీకూ మంచోడే, నాకూ మంచోడే!



చెనిన్ ధనిశెట్టి

తెలుగు సినిమా నపుంసక ఇన్‌ఫాట్యుయేషన్ గాల్లో శబ్ద తరంగాల్లో.

"నేను గానయితే నరికేసుండేవాణ్ణి!" చెంగల్రాయుడంటున్నా డెవరితోనో. వాడు రోజూ నరుకుతూనే ఉంటాడు. వాడి చుట్టూ పేరు లేని మనుషులు... ఏ విధంగా చూసినా. సూసైడ్ ఈజీ ఫండమెంటల్ హ్యూమన్ రైట్! రైట్.... రైరో....

దీపో ఉరఫ్ సదానందం బ్రూటస్, నా మిత్రుడు... ఈ పాటికే వస్తూ ఉంటాడు. వాడు కొన్ని సంవత్సరాలు దొంగ, కొన్ని సంవత్సరాలు రాజకీయ నాయకుడు, వార్డు మెంబరు, దళిత నాయకుడు, మరికొన్ని సంవత్సరాలు రియలెస్టేటు బ్రోకరు. ఐదు సంవత్సరాలు ఎమ్మెల్యే మాజీ అయిన తర్వాత ఇప్పుడో పైరవీగాడు.

వచ్చేశారొచ్చేశారు.... రచీతలంతా వొచ్చి శరీరాల్ని బెంచీల కతికిస్తున్నారు. వొచ్చారు. సాయంత్రందాకా పోరు.

"ఎక్స్‌పెరిమెంటల్ లిటరేచర్ టెల్గూలో అస్సల్లేదోయ్...! మన పత్రికల నిండా, సాహిత్య ప్పేజీలనిండా వొట్టి మదపుటోసన....!" అంటున్నాడు శంకర్రావు. గొల్లున నవ్వులు... ఈ ఏరియా రచయితల లాబీకి అనధికార ఎమ్మెల్యే. వాడో సాహితీ రాజకీయవాది. కాదా? నిబద్ధ తారాచకవాదా? రెండున్నూ.

"సార్! ఎన్న వేణుం?" నాయర్ మొహంలో దిగులు మేఘం.

ఒరే! మీ రొట్టి టీలే తాగుతారే, నా సామ్రాజ్యంలో సగం బెంచీల నాక్రమిస్తారే! ఇంతా జేసి సాయంత్రానికి మీ బిల్లు ముప్పయి రూపాయలే! ... నాయర్ని చూస్తే నవ్వు.

నా చిన్నప్పుడు అగ్గిచెక్కుల్నీ, కార్కులనీ దాచుకునేవాడ్ని భద్రంగా. అలా దాచుకుంటాడు నాయర్



డబ్బుల్ని... చిల్లర డబ్బుల్ని. పాపం, నాయురు భార్య ఏం చేస్తూంటుందో...? ఇంటి దగ్గర ఒంటరిగా ...

వాడెవడో అంటున్నాడు ఫెమినిలిస్టులొచ్చిం తర్వాత ప్రతిదీ ఆలోచించి రాయాల్సి వస్తుందని. రాయిరా, రాయి! గులకరాయి, ఐశ్వర్యారాయి, ఎమ్మెన్‌రాయి, కీచురాయి, పిచ్చి, సిల్లీ కథలన్నీ రాయి... రాయి! రాసీ దేశంమీద వదులు అచ్చోసి... అందర్లో కొందర్ని పెర్వెర్ట్షప్ దారి పట్టించు... ఎన్ని అక్షరాలు, ఎన్ని పేరాలు, ఎన్నెన్ని కథలూ మెంటల్ ఇల్‌నెస్ డ్రామాలు...!

పారనోయియా పేరడీలూ, మానియా కామెడీలు, డిప్రెషన్ ట్రాజెడీలు, హిస్టీరిక్ మెలో డ్రామాలు, ట్రాన్స్‌వెస్టిక్ ఫ్రేజులూ... స్కిజోఫెర్నిక్ రచీతలూ, బెంచీతలూ, న్యూస్‌ప్రింట్ వేస్ట్ చేయడం, హిందువు కాకపోవడం కన్నా హీనమైన పాపం... పాపం ఎవడో అంటున్నాడు... లిబరల్ ఫెమినిజాన్నే ప్రైస్ చేయాలని. అవునొరే, అవును! ప్రైస్ చేయాల్సిందే. ప్రైస్‌లోనే సెక్సుంది.... సెక్స్... టేక్స్ షార్టెస్ట్ టైమ్... క్రియేట్స్ లాంగెస్ట్ ట్రబుల్.... ట్రబుల్... నీక్కా దామెకు... నైన్ మంత్స్ లాంగెస్ట్ ట్రుబల్.

అయినా ఓ మాట అడుగుతాను నిన్ను ... సామాజికుడా! మా ఊరి ఎంకమ్మకంటే లిబరల్ ఫెమినిస్టెడుందిరా... ఓచేతికింద చెంగడూ, మరోచేతికింద రావిరెడ్డి. ఇద్దరూ కాక, అసలు మొగుడొకడు... ఇంక అరటితోట మొగుళ్ల గురించి అస్సలు జెప్పబళ్లా... 'ఎ నేషన్ విత్తౌట్ విమెన్ ఈజ్ స్టాగ్నేషన్' యాడుందీ ఎంకమ్మా నా అల్లిబిల్లి ఎంకమ్మా....? కర్రెత్తుకుని కుంటుకుంటూ, గిన్నెత్తుకుని అడుక్కుంటూ నరాల జబ్బుతో, కీళ్ల నొప్పులతో ఉంఢుండి అరుస్తూ, మా వూర్రోడ్లమీద తంద్రీ, రామచంద్రా! లైఫ్ ప్రొజెక్టర్లో తిరిగే అరిగిపోయిన ముసలితనాన్ని కట్ చెయ్యరాదుట్రా...?

వాడే... వాడే జులపాల పాలూరుతున్న పాలబుగ్గాలా పిల్లగాడు. పొట్టి జాకెట్టు, పిట్ట నడుము ఆంటీ అందాన్ని తాగేస్తున్నాడమృతంలా.... కళ్లతో తాగీ తాగీ కిక్కెక్కువయినట్టుంది. ఊగుతున్నా డటూ ఇటూ అసహనంగా. కళ్లతో అబ్జర్వేషన్ ఓ పెద్ద మాస్టర్బేషన్. ఇటీజ్ మోర్ ఏ మేటర్ ఆఫ్ సెల్ఫ్ కంట్రోల్ దేన్ ఆఫ్ సెల్ఫ్ లవ్! పంతొమ్మిదో శతాబ్దంలో మాస్టర్బేషనో పెద్ద జబ్బు... ఈ శతాబ్దంలో అన్ని జబ్బులకూ ఇదే మందు. అయినా మిలీనియండోముల జాముల తర్వాత నా గ్లోబుకి గోముగా కండోము తొడుగుతాను ఏ ఎయిడ్సూ రాకుండా. గోదారి గట్టు మీదా గోరింక వొకటి వుందీ... గో...గో...గో... నా చూపులు ఆ పదారేళ్ల యవ్వనం నవ్వినప్పుడు బుగ్గమీద పడే ఎర్రటి కెంపు ముక్కెర సొట్టపైకే స్ట్రైట్‌గా గో...గో! ఏవుందీ ఎర్రి నాగన్నా... చిన్నా... మున్నా... ఆ ఎర్రా ఎర్రాటి ... తెల్లా తెల్లాటి దంతం చెరమం ఎనకా ఎనకెనకా ఏవుందీ...? చెప్పూ! సంపర్కం తర్వాత పైశాచిక ఫిలాసఫికపు నిర్వేదం తప్ప.

అది తక్కువయితే నింఫోమానియా. ఒరిజినల్ సిన్నూ, విధి విషాదమూనూ. ఎక్కడో ఓ ఇగో అంటుంది "మా కజిన్ రేపు అబ్రాడ్ నుంచొస్తున్నాడోయ్! ఎన్వీ అడుగుతోంది. ఏం చేస్కున్నా డక్కడ?"

కంప్యూటర్ కూలోడు తలబద్దలు గొట్టుకుని, మైగ్రేన్ వచ్చేలా కూలి పని చేస్తేనే బిచ్చం డాలర్ల భిక్షం! "కన్నుల్లో కనుపాపై గురువా...వా...." వారెవ్వా... గుడ్డి ముసలోడు బొచ్చెలో టీ అడుక్కుంటున్నాడు దీనంగా.


ఈ మూల ఓ సల్మాన్‌ఖానులాంటి ముసల్మాను వెజ్ బిర్యానీ టీలో నంజుకుంటున్నాడు నాజూగ్గా. కన్నులున్నవి రెండైనా చూపుమాత్రం ఒకటేలే... చూపులు... రెటీనా డిసార్డర్ అయితే పధ్నాలుగు రకాల చూపులు చూస్తాం మనం. గాయుని గ్లాకోమా ప్రేమైకంలో గుంజుకుంటోంది గుడ్డిగా.

ఒరే రెహమానా! నువ్వైనా ఆ ముసలోడికి టీ ఇప్పించరా, పుణ్యముంటుందీ...

రాడు... రానే రాడు... ఈ డీఫో ఉరఫ్ సదానందం బ్రూటస్‌గాడు... మందు మత్తులో వ్యభిసారికలా వాడికోసం నేను చూసీ చూసీ ... ఎదుర్చూసీ చూసీ... కడకి ఐ మే బీ డేనైనా, మై ఐస్ ఆర్ ఓపెనే!

పక్క బెంచీలో రెండు తలల్లేని శరీరాలు ... ఆడా, మగా... వుత్త మొండాలు మాట్లాడుకుంటున్నాయి ... మార్మిక మృతభాషలో.

ఒకడు : వింటున్నావా, యుగయుగాలుగా అంతుబట్టని వ్యథతో...




అన్వేషిస్తూ... అది ఫలించక మరణించిన ... ఇంకా పుట్టని మనిషిని గురించి మాట్లాడుతున్నాను నేను.

ఒకతె: చెప్పేందుకేవీ లేదు, 'నిశ్శబ్దం నా మాతృ భాష'.

వాడే : మనం ఇక్కడ చేసేందుకేవీ లేదు, బయల్దేరుదామా?

అదే : ఆగాగు... ఉందుంది. కొద్దిగా మిగిలుంది. మనం కపోతాలను పెంచుదాం. సూర్యరశ్మిని నగ్నంగా కౌగలించుకుందాం... అడవి మధ్యలో అనాథగా భోరున కురిసే వర్షంలో తడుద్దాం... ఆకుల అంచుల్లో ముడుక్కుని నిద్రిస్తున్న దొంగ గాలిని తట్టి లేపుదాం.... కలల సెలయేట్లో పిల్ల కాలువలవుదాం. సముద్రాలపైనా, కొండల వెనుకా వృథాగా నిత్యం మరణిస్తున్న వేనకు వేల సూర్యాస్తమయాల్ని, మబ్బుల రంగుల్ని చూద్దాం... శిథిలమైన శివాలయాల వెనుక గాలివాటున వినిపించే భగ్నప్రేయసీ ప్రియుల ఆఖరి సమావేశపు సంభాషణా గుసగుసలు విందాం నల్లమబ్బుల వెండి అంచుల్ని...

మళ్లా వాడే : చాలించు నీ ప్రలాపాలు! నే వొస్తానిక. అర్జంటుగా నే నో నిహిలిస్టుని కలవాలి.

వాళ్లకేసి చూసి బిగ్గరగా నినదించాను నేను "బి రియలిస్టిక్! డిమాండ్ ద ఇంపాజిబుల్!"

రెండు మొండాలు వొక్కుదుట్న కిటికీలోంచి దూకి పరారయ్యాయి.

కన్వర్సేషన్... ఒన్ కైండ్ ఆఫ్ వాయిస్... ఒక గబ్బిలం చెప్పుకుపోతోంది, మరో నక్కతో.

"ఎన్నిసార్లు దిరిగాన్రా, నాయినా ఆ మండలాఫీసు చుట్టూ! గుమాస్తా ముండాకొడుకులు నన్ను నెలరోజులపాటు బెంచీల చుట్టూ దిప్పారు కాళ్లరిగిపోయి... ఇరిగిపోయి... మోకాళ్లు మాత్రం మిగిలాయిరా, సావీ! సలిపేటు గౌనాలని దాపెట్టుకున్న ఆ నూటేభై రూపాయలూ ఆ ముండాకొడుకుల టీ ఖర్చుకు సరేపోయేది...! పోతే పోయింది, పనవ్వద్దా అంటే కస్సు మన్లేస్తారు నా కొడుకులు! గోటి ఏలంత భూమికి పర్మినింటు పట్టా కోసం గంగోవంటి నా ఎర్రావునే అమ్మేశాను. ఎర్రావూ లేదు, డబ్బూ లేదు, పట్టా లేదు... నే నేవిజేతురా, నక్కబావా!"

నక్క చెబుతూంది "ఓసోస్! నీమాత్రానికే ఇట్టైపోవాల్నా? ఇంక రెండొందలుంటే జూస్కో... మా చినబామ్మర్ది ఇలాకోడు వొకడుండాడు ఆ యాపీసులోనే. వాడితో జెప్పి నే న్నడిపిస్తా కత! అవునూ, నీకు సొసైటీలో లోనిచ్చినారా, లేదా?" గలగలా మాట్లాడుతున్న నక్క చేతిలో అరవై మూడు రకాల ముసుగులు, మాస్కులూను.

ఆ మూల రచయితలు వొకర్నొకరు ఎన్‌కౌంటర్ చేసుకుంటున్నారు. మాటలతో మరణించిన వాళ్లని ఈడ్చిపారేస్తున్నారు. రక్తపు బుగ్గలైన వాళ్ల శరీరాల్లో నుంచి రక్తం పొంగుతూ నేలంతా ఆక్రమిస్తోంది. చిక్కటి, ఎర్రెర్రటి పచ్చి రక్తం...!

గోడ స్పీకరు గుర్రు తీస్తోంది, కలల మైకంలో. దాని పక్కనే గండుబల్లి అనీజీగా తిరుగుతోం దటూ ఇటూ.... అర్ధాకలితో. తుప్పు పట్టిన కమ్మీల కిటికీ బయటి ముదురు రంగు ఎండలో నల్లగా ... నెక్ టైలా పరచుకున్న తార్రోడ్డుమీద జుర్రునొచ్చిన కంటెస్సాలోంచి బొజ్జ తడుముకుంటూ దిగుతున్నాడు రెడ్డి.

గప్పున వాసన, కుళ్లిన కరెన్సీ నీచు వాసన. బాంక్‌రప్టర్స్ దగ్గర సాక్షాత్తూ, వాడే ఒంగి మూడు రాత్రులు నిద్ర జేసి లోన్లు దెచ్చి, ఆర్నైని మానేజ్ చేసి డికెటి లాండ్‌లో రొయ్యి గుడ్డును నాటాడు. బహుళజాతి ఎరువు దెచ్చి ఆ పంటను ఏపుగా పెంచాడు. రెండు కార్లకే రెక్కలు కట్టుకొచ్చి వాలింది కట్టల కట్టల కరెన్సీ వాడి ఒళ్లో. వాడి ఒళ్లో పడి అది జారీ జారీ బిల్డింగులుగా, కార్లుగా, షేర్లుగా, ఫిక్స్డ్ డిపాజిట్‌లుగా, ఒక లాడ్జిగా, ఒక అట్టర్‌ఫ్లాప్ సినిమాగా, ఒక బార్ అండ్ రెస్టారెంట్‌గా, ఇద్దరుంపుడు గత్తెలుగా... వాడి పెళ్లాం మెడలో నగలుగా, వాడి కొడుకు చేతిలో డిజిటల్ కెమెరాగా ఇంకా ఎన్నెన్నోగా మారిపోయింది క్షణాల్లో. అంతా క్షణాల్లోనే!

అర్జూసి వాడూర్లో మూడొంద లెకరాల మాగాణులు తమ గుండెల్ని తామె తవ్వుకుని రూపాలు మార్చుకున్నాయి రొయ్యల గుంటలుగా. వైరస్ ఆక్టోపస్‌లా అరగంటకో ఎకరాన్ని స్వాహా చేసింది. ఇప్పుడు ఆ పల్లెలో వైరస్ రొయ్యల్ని తింటూ అన్నాన్ని నంజుకుంటున్నారు ... సన్నా చిన్న వెన్నెముకలు.

పూర్వాశ్రమంలో రెడ్డితో కల్సి రొయ్యగుంటల కాడ మందుకొట్టిన జ్ఞాపకం. రొయ్యల కయ్యలమీద చెందూరూ డూగుతూ, ఉయ్యాలలూగుతూ రొయ్యి వేపుడు మసాలా గుభాళింపులో వెచ్చగా గొంతులోకి దిగుతున్న తీపి చేదు వికారపు వాసన రమ్ము.... అవున్నిజ్జమే... ఆ రోజు అర్ధరేత్రి కాడ నన్నో పాశవిక ఫెమినిస్టు కవిత వెంటాడింది. సందుల్లో గొందుల్లో తిరిగీ అలసీ సొలసీ వొగ మగ పోలీసుని శరణు వేడి లాకప్‌లో దాక్కున్నాను.

రెడ్డి ట్రాన్స్‌పరెంట్ జేబుల్లో ఐదొందల నోట్లు ... గవర్నమెంటువా? రామకృష్ణ గౌడువా? లేక 'రాగమువకృర్ష్ణమెంగౌటుడు' నోట్లా?

మరణించిన రచీతల శరీరాల నుంచి కారుతున్న రక్తం మడుగులు కడుతోంది... సుళ్లు తిరుగుతూ...

"గుర్తుంచుకో సోదరా, మనం కమ్మలం.... కాపులం, రెడ్లమూ భవిష్యత్ మైనారిటీలం మనమే! వొచ్చే కాలమంతా మనదే...! మన్లో వొకడైనా అంబేద్కర్ పుట్టకపోడు!" నాడీ జాతకం చెబుతున్నా డా మూల రెడ్డి ఎవరికో.

వాడు విప్లవానికే అబార్షన్ చేయగల సమర్థుడు. వాడు విప్లవ మంత్రసానుల్ని ఉరితీసే తలారి... వురి.... వురి.... వురి... ఖాద్రి.... జస్టిస్ ఖాద్రి.... రాజీవ్‌గాంధీ నీకూ మంచోడే, నాకూ మంచోడే! కానీ, నా పక్కింటి అరవోడికి మాత్రం వాడి కవి, కుయిల్‌దాసన్ మంచోడు. వాడి కొడుకు మురుగన్ మరీ...మరీ...రీ... మంచోడు. మురుగనకు ఎందుకేశావు వురిశిక్ష?

రికామి గాలికోర్టులు.... కోర్టు, హంతకుడిలోకి పరకాయ ప్రవేశం. "చింతించకు జస్టిస్ థామస్! ఆరిద్ర వుట్టుకతోనే దరిద్రురాలు. మాన్‌షియర్‌ను వురితీసినందుకు విక్టర్ హ్యూగో ఒక్క పెట్టున ఏడుస్తున్నాడివ్వాటికీ... గుండెలవిసేటట్టు... కాబట్టి వురిశిక్ష రద్దు చేసేందుకు వీల్లే దంతే!" వాదిస్తున్నాడో నల్లకోటు డ్రాకులా ప్లీడరు.

నువ్వు కరెక్టేరా తంబీ! నీకు ఉరిశిక్ష పడినరోజున నీ తరఫున, నీ కోసం నేనుద్యమిస్తాను ఉరిశిక్ష రద్దుకోసం! ఆమన్... మురుగనళిని, శాంత పెరారివలన్... మీకోసం మొత్తం మద్రాసంతా ఏడుస్తూంది. ప్రతి తమిళుడూ మీకో కన్నీటి బిందువునిస్తాడు బహుమతిగా. 'హంతకుడిచేత వురితీయబడ్డ హంతకులు ఇక్కడ నిద్రిస్తున్నారు'... ఇదే మీ సమాధిపై ఎపిటాఫ్... ఇద్దరే ఇద్దరు రక్షించగలరు మిమ్మల్ని. ఒకరు రాష్ట్రపతి, ఇంకొకరు రజనీకాంతూ... గాడ్స్ మస్ట్ బి క్రేజీ.. మన జీవితాలకు ఫుల్‌స్టాపులూ, కామాలూ కోర్టులు కూడా నిర్ధారిస్తాయి ఒక్కోసారి ... క్లియర్ థింకింగ్ రిక్వైర్స్ కరేజ్ రేదర్ దేన్ ఇంటెలిజెన్స్... వోల్డ్‌క్రస్క్ కిక్కు తగ్గిపోతోంది కొద్దికొద్దిగా. మడుగులు కట్టిన రక్తం ప్రవాహంగా మారుతూంది. నా మెదడ్లోని సెరిబ్రల్ హెమిస్ఫియర్ మెడుల్లాతో గుసగుసలాడుతూంది మెల్లమెల్లగా... వీడాలోచించేది నాకర్థమై చావట్లేదని.

కాంటీనంతా గందరగోళంగా ఉంది. అరుపులూ, కేకలూ... కీరవాణి రాగంలో పలికిందొక హృదయం. గోడ స్పీకరు గీరగా పాడుతోంది. డీఫోగాడు వచ్చేట్టు లేదు. ఎక్కడో నా మిత్రులతో కలసి నా సమాధిమీద పుష్పగుచ్ఛం ఉంచుతూ ఉంటాడు. విచారంగా నా స్నేహితుడు డీఫో ఉరఫ్ సదానందం బ్రూటస్ శేఖర్ ఇటే వస్తూన్నాడు. ప్రభ రిపోర్టర్ శేఖర్ చెబుతున్నాడు "వొరే, నువ్విక్కడున్నావా? అక్కడ నీ ఫ్రెండు సదానందంగాడు జిడ్డు కృష్ణమూర్తితో లేచిపోయాడు! నువ్వేమో వుమర్ ఖయ్యాంలా ఇక్కడ...! సరే భాయ్, ఓ చాయ్ కొట్టించు!" వాడు చెపుతున్నాడు.

నే నెవర్ని? హు యామ్ ఐ? ఇక్కడెందుకున్నాను? జేబులన్నీ ఖాళీగా, మనసు ప్రశాంతంగా, శరీరం హేంగోవర్‌గా ఉంది.

ఇక సాయంత్రం మిగిలుంది. అడవికెళ్లి ఇప్పసారా తాగుతాను.


నాయర్ నన్ను చూసి నవ్వుతున్నాడు గలగలా.

కేరళ ... నల్లటి నొక్కుల జుట్టు కేరళ... తెల్లటి పంచెల కేరళ... జేసుదాసు కేరళ... వర్షాల కేరళ... మంగళా, కె.కె. ఎక్స్‌ప్రెస్ కేరళ, అరటికాయుల అల్వారుగెడ్డల కేరళ.... అయ్యప్పల కేరళ... ఆడపిల్లల కేరళ... ఆమె రాత్రుల కేరళ....

కేరింతతో ఆడుతున్నాడో నపుంసకుడు కాంటీన్ మధ్యలో "రాజు లేనపుడూ సారంగో, నువ్వు రారాదా, పోరాదా సారంగా...!" గిర్రున తిరుగుతూ, అడుగులేస్తూ.

ప్రవహిస్తున్న రక్తం నేలంతా ఆక్రమిస్తోంది. విచిత్రంగా చూస్తున్న జనం ముఖాల్లో గొప్ప రిలీఫ్ ... చిర్నవ్వులు... చిర్నవ్వు ఎన్ని నెలలకూ... ఎంత ఖైదీలమైపోయాం? గాయపడిన మనసుల్తో జీవితాన్ని ఛిద్రం చేసుకుంటున్నా, మా ఆశయాలు, ఆదర్శాలు, ఊహలూ... ఇరుకిరుకు దారులూ, బోర్... బోర్... యాంత్రిక రతి... మూసపోస్తున్న బొమ్మలూ... కాలుష్యం, కష్టాలూ, చదివిన పుస్తకాల్నే చదవడం, రాసిన పరీక్షల్నే మళ్లీ మళ్లీ రాస్తూ, సిసిఫస్‌లా చేసిన పనినే చేస్తూ... మొనాటనీకర బాల్యాలు, బాంబు పేలుళ్లు, దొంగనవ్వులు, నమస్కారాలు.... సైన్స్‌తోపాటు ఎక్కడికో కొట్టుకుపోతూ, నిరాసక్తంగా నగరాల్లో నలిగీ నలిగీ, పల్లెల్లో కృశించీ కృశించీ, కరవులు, సినిమాలు, కథలు, పత్రికలు, వృథా చదువులు, గాలి మాటలు, కెమికల్స్ తాగుతూ, తింటూ, మన సమాధులు మనవే తవ్వుకుంటే ... ఎవ్వరూ వినడంలేదు.... అరుస్తున్నాను నేను....

ఈ గాలిని మీరు స్పృశిస్తున్నారా? ఈ పచ్చటి చెట్లను మీరు గమనిస్తున్నారా? ఈ కొండల్నీ, బండల్నీ మీ రవలోకిస్తున్నారా? ఈ పక్షుల అరుపులు మీకు వినబడుతున్నాయా? నిండు చంద్రుని వెన్నెలను మీ రనుసరిస్తున్నారా? సంధ్యాకాలంలో ఈ భూమిని ఆవరించే నిశ్శబ్దాన్ని మీరు వింటున్నారా?




గిర్రున తిరుగుతూ అడుగులు ... సారంగో.... అడుగులు.... రారాదా...!

నేలనంతా ఆక్రమిస్తున్న రక్తం .... రాజు లేనపుడూ.... డాన్సింగ్ చూస్తున్న జనాల కాళ్లకింద నుంచి ప్రవహిస్తూ... సారంగో.... నువ్వు....

అమ్మో... నా కాళ్లు రక్తంతో తడుస్తూ జిడ్డుగ్గా, తేమగా.

రాజు లేనపుడూ ... నపుంసకుడి పాదం సరిగ్గా రక్తాన్ని తాకింది.... పోరాదా సారంగా.... పెట్రోలు అంటుకున్నట్టు ఉవ్వెత్తున మంట... మంటలు...

పరుగెత్తుతా... అమ్మో! మంటలు... పరుగెత్తండి....!

బెంచీలు ఎగిరి దూకుతూ అడ్డు వస్తున్నవాణ్ణి తోసుకుంటూ... నీలిరంగు జ్వాలలు నాల్కలు చాస్తూ....

వేడి... దుర్గంధం... ఉక్కిరిబిక్కిరి.... బయటపడ్డాను.

పరుగు... పరుగు.... ఒక ఫర్లాంగు ... రెండు ఫర్లాంగులు ... వెనుదిరిగి చూశాను వొగరుస్తూ.

ఆకాశానికెగుస్తున్న జ్వాలలు... కాంటీన్ తగలబడిపోతోంది... మంటల్లో దగ్ధమవుతున్న వ్యక్తుల అరుపులు వినిపిస్తున్నాయి....

సూర్యుడు తూర్పున అస్తమిస్తున్నాడు మెల్లగా....

నాకు తెలుసు 'నేను' తప్ప అందరూ మరణించారని!

■